రైతులకు అండగా.. ఆర్‌బీకేలు

- గ్రామగ్రామానా రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు
- విత్తు నుంచి అమ్మకం వరకు అన్ని సేవలూ ఆర్‌బీకే ద్వారానే

ఏలూరు(మెట్రో) : రైతులకు భరోసాగా ఆర్‌బీకేలు నిలుస్తున్నాయి. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో రైతు భరోసా కేంద్రాలు ఒకటి. విత్తు నుంచి అమ్మకం వరకు అన్ని సేవలు ఆర్‌బీకేల ద్వారా అందిస్తూ, వ్యవసాయం దండగ రోజుల నుంచి వ్యవసాయం పండుగ అనే రోజులకు రైతన్నలను తీసుకువచ్చింది రాష్ట్ర సర్కారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా, జగనన్న సర్కారు రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకుంది. గ్రామ గ్రామాన రైతులకు సేవలు అందించాలనే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రతి రైతు లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంది.

అన్నదాతలకు అండగా..

గత పాలకులు వ్యవసాయం ఒక దండగ, పరిశ్రమలు ఎంతో మేలు అని సాగును పూర్తిగా నిర్లక్ష్యం చేసేవారు. జగనన్న సర్కారు బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతన్నలకు ప్రాధాన్యత కల్పించేందుకు చర్యలు తీసుకుంది. గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అన్ని సేవలు అందేవిధంగా చర్యలు తీసుకుంది. రుణాల దగ్గర నుంచి విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, యంత్ర సేవ పరికరాలు, భూసార పరీక్షలు, ఇటువంటివన్నీ రైతు భరోసా కేంద్రాల్లో అందించేలా చర్యలు తీసుకుంది. అలాగే రైతులకు సలహాలు, సూచనలు అందించడంతో పాటుగా ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లోనే లభించేలా అన్నదాతలకు అండగా నిలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రధాన సాగు అయిన వరి, మొక్కజొన్న వంటి పంటలు రైతు భరోసా కేంద్రాల్లో రైతులు నమోదు చేసుకుని ఆ పంటలు రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించుకునే ఏర్పాటును ప్రభుత్వం చేసింది.



468 ఆర్‌బీకేలకు సొంత భవనాలు మంజూరు

జిల్లావ్యాప్తంగా 520 రైతు భరోసా కేంద్రాలు ఉండగా, వాటిలో 468 రైతు భరోసా కేంద్రాలకు సొంత భవనాలను మంజూరు చేశారు. అందులో 208 రైతు భరోసా కేంద్రాలకు సొంత భవనాలు నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచింది. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న 260 భవనాలను సైతం త్వరలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే 52 రైతు భోసా కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటై ఉన్నాయి. ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల సదుపాయాలు, సౌకర్యాలు, సలహాలు, సూచనలు అందిస్తూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రైతు సంక్షేమమే పరమావధిగా భావిస్తున్న జగనన్న సర్కారు గ్రామ, గ్రామాన రైతులకు మేలు చేసే విధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసింది. ప్రకృతి విపత్తులలో నష్టపరిహారాలు, నష్టపోయిన పంటల వివరాలు సైతం ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పారదర్శకంగా పొందుపరుస్తూ గ్రామ స్థాయిలోనే రైతులకు సకల సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోంది. ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా వరి, అపరాలు, పొగాకు, మొక్కజొన్న మొత్తం 2,80,673 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులకు రైతు భరోసాకేంద్రాలు అండగా నిలుస్తున్నాయి.

విత్తు నుంచి పంట విక్రయం వరకు



రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. విత్తు దగ్గర నుంచి పంట విక్రయించే వరకు వ్యవసాయ అధికారులు రైతులకు అండగా నిలుస్తున్నారు. ఏ ఇబ్బందులు లేకుండా రైతులకు, వారు పండించే పంటలకు సలహాలు, సూచనలు సైతం వ్యవసాయ అధికారులు ఆర్‌బీకేల ద్వారా చేస్తున్నారు.

– బి.లావణ్యవేణి, జేసీ, ఏలూరు జిల్లా

గ్రామాల్లోనే సేవలు..



గతంలో ఎరువులు, పురుగుమందులు కావాలంటే మండల కేంద్రాలకు పరుగులు పెట్టేవాళ్లం. కొన్ని సందర్భాల్లో కొన్ని రకాలు దొరక్క ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం అటువంటి సమస్యలు ఏమీ లేవు. గ్రామాల్లోనే రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, పురుగుమందులను రైతు భరోసా కేంద్రాల ద్వారా సులువుగా కొనుగోలు చేయగలుగుతున్నాం.

– బల్లె రాంబాబు, రైతు, వేగవరం

ఇబ్బందులు తొలగాయి



గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పారదర్శకంగా అన్ని సేవలు అందుతున్నాయి. నష్టపరిహారాలు, పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వంటివి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా చేపట్టడం ఎంతో సౌకర్యంగా ఉంది. గతంలో రైతులు ఏ సేవలు కావాలన్నా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం అటువంటి ఇబ్బందులన్నీ తొలగిపోయాయి.

– పోల్నాటి శ్రీనివాసరావు, శ్రీనివాసపురం

క్లుప్తంగా

డీఈవో ఆకస్మిక తనిఖీ



కైకరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న డీఈఓ అబ్రహం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జిల్లాలోని వివిధ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని ఉంగుటూరు, గణపవరం మండలాల్లోని గణపవరం, పిప్పర, అర్థవరం జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేసినట్లు డీఈఓ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా గణపవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నోట్‌బుక్స్ దిద్దని లెక్కల టీచర్‌ని మందలించినట్లు తెలిపారు. అలాగే ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. విజయవాడలోని యనమలకుదురుకు చెందిన వెలగపూడి నాగేంద్ర సాయి హర్ష ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

పాత నేరస్తుల బైండోవర్

పెదవేగి: ఎన్నికల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని పెదవేగి తహసీల్దార్ సూర్యప్రభ హెచ్చరించారు. గురువారం రాత్రి పెదవేగి తహసీల్దార్ కార్యాలయంలో కొప్పాక, న్యాయంపల్లి, పెదవేగి గ్రామాల్లో గత ఎన్నికల్లో కేసులు నమోదైన పాత నేరస్తులను, రౌడీలను పోలీసుల ఆధ్వర్యంలో తహసీల్దార్ బైండోవర్ చేశారు. అనంతరం తహసీల్దార్ సూర్యప్రభ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు పాల్పడినా లక్ష రూపాయల జరిమానా రెండు నెలలు జైలు శిక్ష విధిస్తామని బైండోవర్ చేసిన వ్యక్తులను ఆమె హెచ్చరించారు.

హెచ్‌సీ ప్రవీణ్‌కు పదోన్నతి

పెదవేగి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పీఎస్‌వీ ప్రవీణ్‌కు ఏఎస్సైగా పదోన్నతి లభించింది. ఈ మేరకు గురువారం జిల్లా ఉన్నతాధికారుల నుంచి లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండల పరిధిలో కేసుల ఛేదనలో, ప్రజలకు తనదైన శైలిలో శాంతిభద్రతల పరిరక్షణలో అందించిన సేవలను గుర్తించి పదోన్నతి ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పీఎస్‌వీ ప్రవీణ్‌ను స్థానిక పోలీసులు, నాయకులు అభినందించారు.

గరికపాటికి కీర్తి పురస్కారం



తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం అందుకుంటున్న గరికపాటి కాళిదాసు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఇటీవల ప్రకటించిన కీర్తి పురస్కారాలను ఈ నెల 20, 21 తేదీల్లో ఆయా వ్యక్తులకు ప్రదానం చేసింది. దీనిలో భాగంగా గురువారం తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో నగరానికి చెందిన గరికపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసుకు బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం స్మారక కీర్తి పురస్కారాన్ని ప్రదానం చేశారు. కాళిదాసుకు ఈ పురస్కారాన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ మంగారి రాజేందర్, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు తంగెడ కిషన్ రావు తదితర అతిథులు అందజేశారు. గరికపాటికి కీర్తి పురస్కారం లభించడంపై నగరానికి చెందిన సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం, సినీ కళా విశారద ఎస్‌వీ రామారావు, గురు శర్మ, పరిమి సావిత్రి తదితరులు అభినందనలు తెలిపారు.

యాప్ ద్వారా ఎన్నికల ప్రచారానికి అనుమతి



ఎన్నికల సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఏలూరు రూరల్: ఎన్నికల ప్రచారం కోసం రాజకీయ పార్టీలు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం మొక్కంటి చెప్పారు. గురువారం ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రచారం చేసుకోవాలంటే ఆన్‌లైన్‌లో వివిధ యాప్‌ల ద్వారా ముందస్తు అనుమతి పొందాలన్నారు. ఎన్నికలు సజావుగా నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం యాప్ ద్వారా అనుమతి పొందడంపై అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ వి మురార్జీ, అగ్నిమాపకశాఖ అధికారి వి ఆంజనేయులు, ఆర్‌టీఓ కె శ్రీహరి, కార్పొరేషన్ అధికారి ఎండీ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం

ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో ప్రతి వర్గానికీ మేలు జరిగిందని, మహిళలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేయటంతో పాటు, రైతు, విద్యార్థి పక్షపాత ప్రభుత్వంగా నిలిచిందని.. మరోసారి ప్రజలు వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ కోరారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో 1, 2, 3, 4, 5 డివిజన్లకు సంబంధించి బూత్ కమిటీల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయా డివిజన్ కార్పొరేటర్లతో కలిసి ఆయన ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి బూత్ కమిటీలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ... ఏలూరులో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ గెలిస్తే ఏలూరు నగరంలో రౌడీ రాజ్యం పెరిగిపోతుందని, భూ కబ్జాలు, సెటిల్‌మెంట్లు పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.



ఏలూరు వన్‌టౌన్‌లోని బూత్ కమిటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్



ఏలూరులో పలు డివిజన్లల్లో బూత్ కమిటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న క్లస్టర్ -1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్

ఎమ్మెల్యే ఆళ్ల నానితోనే ప్రజలకు ప్రశాంతమైన జీవనం ఉంటుందన్నారు. ఏలూరు నగరంలోని 6, 7, 8, 9 డివిజన్లకు సంబంధించి పార్టీ క్లస్టర్ -1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బూత్ కమిటీల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ హయాంలో ఏలూరు నగరంలో ప్రజలకు జరిగిన ఒక్క మంచిపని చెప్పే దమ్ము టీడీపీ నేతలకు ఉందా అని ప్రశ్నించారు. టీడీపీ 5 ఏళ్ల కాలంలో పేదలకు ఒక్క సెంటు భూమి అయిన ఇచ్చారా అని నిలదీశారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని హయాంలో ఏలూరులోని 33 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో 1వ డివిజన్ కార్పొరేటర్ ఆరేపల్లి రాధిక, 2వ డివిజన్ కార్పొరేటర్ జున్నూరు కనక నరసింహరావు, 3వ డివిజన్ కార్పొరేటర్ బొద్దాని అఖిల, 4వ డివిజన్ కార్పొరేటర్ వీర్నపు డింపుల్ జాన్, 5వ డివిజన్ కార్పొరేటర్ గరికపూడి ఇమ్మానియేలు జయకర్, 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ళ శ్రీదేవి, 8వ డివిజన్ కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్, 9వ డివిజన్ కార్పొరేటర్ సబ్బాన శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన



గుండుగొలను వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: జాతీయ రహదారిపై గోదావరి కాల్వపై గుండుగొలను వంతెన నిర్మాణం పనులు వేగవంతం కావాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఫోన్‌లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో మాట్లాడి ప్రగతిని అడిగి తెలుసుకుని, నిర్మాణ పనులు వేగవంతం కావాలని సూచించారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ రూ.4.2 కోట్లతో భీమడోలు, దెందులూరు మండలాల ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా వారి ప్రయాణ అవసరాలకు ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలతో వంతెన నిర్మాణ పనులు పూర్తి అవుతాయన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలానవకాంతం గంగరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సీతంపేట సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, పార్టీ కమిటీ అధ్యక్షులు కోటిపల్లి సురేష్ పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గురువారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. స్థానిక మసీదు సెంటర్‌లో ట్రాఫిక్ ఎస్సై రంగయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు సీఐ పి.రాజేష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించామన్నారు. అలాగే హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. మరోసారి హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు చెప్పారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించినట్లు తెలిపారు.

మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి



డీఈఓ అబ్రహంకు వినతిపత్రం సమర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో జరుగుతున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు రాసిన జవాబుపత్రాల మూల్యాంకన త్వరలో చేపట్టనున్న నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులకు ఆ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా నాయకులు గురువారం డీఈవో ఎస్.అబ్రహంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు మాట్లాడుతూ తీవ్ర అనారోగ్య కారణాలతో బాధ పడుతున్న ఉపాధ్యాయులకు, 60 ఏళ్లు పైబడిన వారికి వయోభారం దృష్ట్యా, రంజాన్ ఉపవాస దీక్షల్లో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, అలాగే మినహాయింపు కోరుకునే వారు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని కోరారు. అలాగే దివ్యాంగులు, బాలింతలు, గర్భిణిలకు సైతం మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, స్పెషల్ అసిస్టెంట్‌ల నియామకాల విషయంలో నాడు - నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఏకోపాధ్యాయ పాఠశాలలతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులున్న పాఠశాలలకు మినహాయింపునిస్తూ, 8 కిలోమీటర్ల లోపు పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. కాగా ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరుతూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత గల వారికి విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు, ఇతర నాయకులు ఉన్నారు.

సామాజిక పరివర్తనకు కవితలు దోహదం

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ జయబాబు మాట్లాడుతూ మనిషిని, మనసును కదిలింపజేసే శక్తి అక్షరాలకు ఉంది అని, సామాజిక పరివర్తనకు కవితలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. మనిషిలో సృజనాత్మకతను, నైతిక విలువలను పెంపొందించడానికి కవితల అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కవితలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరంలో వర్షం

పోలవరం రూరల్ : అల్పపీడన ప్రభావంతో పోలవరంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పొలాల్లో అక్కడక్కడా ఆరబెట్టిన మొక్కజొన్న కండెలను రైతులు హడావుడిగా పోగు చేసుకుని బరకాలు కప్పుకున్నారు. పల్లపు ప్రాంతాల్లో పలుచోట్ల వర్షం నీరు నిలిచిపోయింది.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

చింతలపూడి: అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్ అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని గురువారం రాఘవాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వ్యవసాయ శాఖ, పార్ట్నర్స్ అండ్ ప్రాస్పరిటీ(పీఎస్‌పీ) సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అధికారులు, విద్యార్థులు మొక్కలు నాటారు. పీఎస్‌పీ సూచించిన తడిపొడి విధానంలో మెలకువలను మెట్ట రైతులు పాటించాలని విజ్ఞప్తి చేశారు. చెట్ల పెంపకంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మీనా కుమారి, కౌసిక్, పీఎస్‌పీ సీఈఓ నరేష్ చౌదరి, ఏలూరు అగ్రికల్చరల్ ఏడీ సుబ్బారావు, కోఆర్డినేటర్ పులి కీర్తి, ఏఈఓ శ్రీనివాసరావు, ఎం వెంకటేశ్వర్రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ

పెదవేగి: దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి వినతులు వెల్లువెత్తాయి. గురువారం పెదవేగి మండలం కొండలరావుపాలెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అబ్బయ్యచౌదరి వినతులు స్వీకరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యను చెప్పిన వెంటనే సత్వరం పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05,07,10
బెండకాయలు	20	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	40	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	40	అల్లం	160
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32-36	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	24-28	గోంగూర	08
గోరుచిక్కుడు	32	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	14

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు -తిరుపతి	16.00	4830	29